సీఎం జగన్‌కు ప్రజాక్షేత్రంలో ఆదరణ

సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు హారతి ఇస్తున్న మహిళ

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఆదరణ పెరుగుతోందని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గుణదల ఒకటో డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల నాడి తెలిసిన నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ పేరు తెచ్చుకున్నారని.. ప్రజలకు జనరంజక పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు తెరవెనుక కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని స్పష్టం చేశారు.

ప్రజాద్రోహి చంద్రబాబు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు పరుస్తున్న ఇళ్ల పట్టాలను పేదలకు అందకుండా చంద్రబాబు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి విమర్శించారు. లేనిపోని కారణాలు చెప్పి పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు కాకుండా కోర్టును ఆశ్రయించిన చంద్రబాబును ప్రజాద్రోహిగా అభివర్ణించారు. పేదలపై చంద్రబాబుకు అంత అక్కసు ఏంటని ప్రశ్నించారు. టీడీపీ పాలనలో ప్రజాసంక్షేమం కనుమరుగైందని, వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజలంతా సుభిక్షంగా జీవిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా తెలుగు తమ్ముళ్లు బుద్ధితెచ్చుకుని ప్రజాహిత కార్యక్రమాలకు ఉపక్రమించాలని హితవు పలికారు.

ప్రశాంత్ కిషోర్ ప్రభావం ఉండదు..

రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై పెద్దగా ఉండదని ఎమ్మెల్యే వెలంపల్లి తేల్చిచెప్పారు. చంద్రబాబుతో ప్రశాంత్ కిషోర్ చేతులు కలిపినట్లు వస్తున్న వార్తలను ఖాతరు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పాలనను ప్రజలు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలే తిరిగి పార్టీని అధికారంలోకి తెస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను స్థానికులకు అందజేశారు. కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు కొండా మహేశ్వరరెడ్డి, కొంగితల శివ, బండి వేణు, ఉద్దంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృఢసంకల్పంతో పని చేస్తోందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ల అంశంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను సోమవారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం చేయని ఇళ్ల రిజిస్ట్రేషన్ల కలను సాకారం చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మెచ్చుకోవాల్సింది పోయి ప్రతిపక్షాలు అసత్యాలతో విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవిన్యూ, నగరపాలకసంస్థ అధికారులు సమన్వయంతో.. క్షేత్రస్థాయి సిబ్బందికి సరైన దిశానిర్దేశం చేస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 5,390 మందికి వివిధ జీవోల ద్వారా సర్వహక్కులు కల్పించామన్నారు. త్వరలోనే వీరందరికీ పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా జీవో నెం.32 (30.01.2023), జీవో నెం.4 (03.01.2023)ల ప్రకారం గతంలో పలు సందర్భాల్లో పునరావాస లబ్ధిదారులకు న్యూరాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ సహా అజిత్‌సింగ్‌నగర్, బర్మాకాలనీ, పాకిస్తాన్ కాలనీ, రాధానగర్, సంతోషిమాత టెంపుల్ తదితర ప్రాంతాల్లో కేటాయించిన 3,155 మంది ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వారికి కొనసాగింపు జీవో వెలువడిన వెంటనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అలాగే నిషేధిత భూముల జాబితా సెక్షన్ 22(ఏ)లో ఉన్న భూముల తొలగింపునకు మార్గం సుగమం కావడంతో.. నార్త్ మండల పరిధిలో 20,944 కుటుంబాలు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని పేర్కొన్నారు. జీవో నెం. 60 (16.02.2023) ద్వారా 100 గజాల లోపు ఉన్న 115 కుటుంబాలకు ఉచితంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. జీవో నెం. 36 ద్వారా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 150 గజాల లోపు గల 511 మంది లబ్ధిదారులందరికీ రెగ్యులరైజ్ చేసి రిజిస్ట్రేషన్ హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే చేతులు మారిన మరో 371 మందికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ జీవో. 84 (24.02.2023) ద్వారా అర్హులైన 318 మందికి హక్కులు కల్పించినట్లు చెప్పారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత ఏళ్ల తరబడి పరిష్కారం కాని హెచ్ బ్లాక్ కాలనీవాసుల సమస్యకు ఓటీఎస్ ద్వారా పరిష్కారం చూపినట్లు మల్లాది విష్ణు తెలిపారు. మొత్తంగా 550 మందికి సవరణ చేసిన దస్తావేజులు పంపిణీ చేసినట్లు వివరించారు. టీడీపీ హయాంలో ఒక్కొక్కరి నుంచి రూ. 50 వేలు వసూలు చేయడంతో పాటు స్టాంప్ డ్యూటీ కింద రూ. 8 వేలు వసూలు చేసి జనాల సొమ్ము దోచుకున్నారు తప్ప ఒక్కరికైనా రిజిస్ట్రేషన్లు చేయించారా అని నిలదీశారు. వారి చేతుల్లో మోసపోయిన వారికి కూడా జగనన్న ప్రభుత్వంలో న్యాయం జరిగిందని, ఇంకా అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా మిగిలిపోతే తమ కార్యాలయంలో కానీ ఆయా సచివాలయాల వీఆర్వోలను కానీ సంప్రదించినట్లయితే.. ఇళ్లను రెగ్యులరైజ్ చేసి హక్కుతో కూడిన పట్టాలు అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'స్పందన'

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని చేపట్టిందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. మొత్తం 12 ఫిర్యాదులను స్వీకరించగా వాటిల్లో ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి నాలుగు, ఎస్టేట్ విభాగానికి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, హార్టికల్చర్ ఒకటి, ప్రజారోగ్య శాఖ ఒకటి, యూసీడీ ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వివిధ సమస్యలతో స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమస్యలను దిగువ స్థాయి సిబ్బందికి తెలియజేసినా పరిష్కారం కాకపోతేనే ఇక్కడి వరకు వస్తారని, అటువంటి సమస్యలపట్ల అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఒకసారి ఇక్కడకి వచ్చిన సమస్య నిర్ణీత సమయంలో పరిష్కారం కాకపోతే వారు మళ్లీ వస్తారని, ఆ విధంగా రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. అప్పుడే ప్రజల విశ్వసనీయత, నమ్మకాన్ని చూరగొంటారని పేర్కొన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఏడీహెచ్ రత్నకొండ రామమోహన్, బయాలజిస్ట్ సూర్యనాయక్, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): వేపచెట్టు నరుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిన వ్యక్తి మృతి చెందినట్టు నున్న పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పాయకాపురంకు చెందిన దగ్గుల నాగేశ్వరరావు(43) ఆటోడ్రైవరు. వాంబేకాలనీలో మృతుని భార్య అమ్మమ్మ ఇంటికి ఆదివారం వెళ్లగా ఇంటిపక్కనే దట్టంగా పెరిగిన చెట్టు తొలగించమని భార్య శారద చెప్పింది. చెట్టు ఎక్కి నరుకుతుండగా కాలుజారి కిందపడిన నాగేశ్వరరావును చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నాగేశ్వరరావు మృతి చెందినట్టు డాక్టర్లు చెప్పారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీఎస్ నిబంధనలపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఐరన్ యార్డ్‌లోగల ఐరన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం టీడీఎస్ నిబంధనలపై వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారి కెఎస్ఎన్ రాము మాట్లాడుతూ టీడీఎస్ నియమ నిబంధనలపై సరైన అవగాహన లేకపోవడం వలన పన్ను మినహాయింపుదారులు వివిధ డిఫాల్ట్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఫలితంగా టీడీఎస్ రిటర్న్‌ల ప్రాసెసింగ్‌పై అనవసరమైన డిమాండ్లు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. పర్యవసానంగా జరిమానాలు, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి చర్యలను నివారించేందుకు ప్రతి వ్యాపారస్తుడు టీడీఎస్ నిబంధనల గురించి తప్పనిసరిగా తెలుసుకుని తీరాలన్నారు. టీడీఎస్ విషయంలో ఎటువంటి అనుమానం ఉన్నా తమను సంప్రదిస్తే సహకరిస్తామని చెప్పారు. సదస్సుకు హాజరైన అసోసియేషన్ సభ్యులు తమ సందేహాల గురించి అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రం రమణయ్య, సెక్రటరీ కొనకళ్ల సూర్య శంకర్, ఆడిటర్ రాఘవులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో నూతన వెలుగులు



లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, డెప్యూటీ మేయర్



కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేద ప్రజలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తూ పేదల జీవితాల్లో నూతన వెలుగులు నింపుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం 60వ డివిజన్ వాంబేకాలనీలోని వీఎంసీ కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. దీనిలో పాల్గొన్న వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 31 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించామని, ఆ సమయంలో కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం కొంచెం ఆలస్యమైందని పేర్కొన్నారు. పేదలకు మంచి జరుగుతుందంటే చంద్రబాబు ఓర్చుకోలేదని, వారికి ఇళ్లు ఇస్తుంటే కోర్టులకు వెళ్లి ఆపాడని తెలిపారు. అలానే పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం అందిస్తుంటే వ్యంగ్యంగా మాట్లాడి విమర్శలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 32 లక్షల మంది నిరుపేదలు సొంతింటి లబ్ధిని పొందుతున్నారని వెల్లడించారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందకుండా అడుగడుగునా అడ్డుపడిన చంద్రబాబును, టీడీపీ నాయకులను ప్రజలు ఊరికే వదిలిపెట్టరని, వచ్చే ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అమలు కావాలన్నా, పేద ప్రజలు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నా మళ్లీ జగనన్నే రావాలన్నారు. టీడీపీ వస్తే సంక్షేమ పథకాలన్నీ నిలిపివేస్తారని అన్నారు. టీడీపీ మోసపూరిత హామీలను ప్రజలెవ్వరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. 2014 నుంచి 2019 వరకూ ఇచ్చిన హామీలను చంద్రబాబు ఎందుకు అమలు చేయలేదో ప్రజలంతా నిలదీయాలని చెప్పారు. హామీలకే పరిమితమైన చంద్రబాబును ఈసారి ఎన్నికల్లో తన ఇంటికే పరిమితమయ్యేలా ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు ఇసరపు దేవి, ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

అందుకో.. ఇంటి పట్టా

కండ్రికలో ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



281వ వార్డు సచివాలయంలో ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గం 64వ డివిజన్ 281వ వార్డు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా అర్హత గల పేద కుటుంబాలకు ఇంటి స్థలాలను పంపిణీ చేయడం జరిగింది. అంతేకాకుండా ఇళ్లు నిర్మించుకోవడానికి రూ. 1.80 లక్షలు అందజేస్తోంది. అలాగే లబ్ధిదారులకు ఇంటిస్థలాన్ని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు పది సంవత్సరాల తర్వాత ఆ ఇంటిపై సర్వహక్కులు కల్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో సచివాలయాల్లో లబ్ధిదారుల పేరిట అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. 64వ డివిజన్ కండ్రిక సచివాలయం పరిధిలో ప్రభుత్వం 405 మంది లబ్ధిదారులకు నున్న, సూరంపల్లి, కొండపావులూరు, జి.కొండూరు గ్రామాల్లో ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. వాటిలో 329 మందికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సచివాలయ అడ్మిన్ రాజు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్స్ చేయడం జరుగుతోందన్నారు. అడ్మిన్‌కు ప్రభుత్వం జాయింట్ రిజిస్ట్రార్ హక్కు కల్పించడంతో వీఆర్వో తంబ్ తీసుకుని కన్వేయన్స్ డీడ్ తయారు చేసి లబ్ధిదారుల పేరిట ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం సర్వహక్కులు కల్పించలేదని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సొంతింటి కల నెరవేరింది



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరింది. 20 ఏళ్లుగా కండ్రికలో అద్దె ఇంటిలోనే ఉంటున్నాం. నా భర్త లారీ డ్రైవర్. ఇద్దరు పిల్లలతో చాలీచాలని ఆదాయంతో అద్దె చెల్లించుకుంటూ బ్రతుకుతున్నాం. సీఎం జగనన్న పేదలకిచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు సాయం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుంటాం.

– కలకోటి అపర్ణ, కండ్రిక

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు




ఎంతో మంది పేదలు సొంత ఇళ్లు లేక అద్దెకుంటున్నారు. నాకు ఇద్దరు పిల్లలు, భర్త లేడు. ఎన్నో ఇబ్బందులు పడుతున్న మా లాంటి పేదలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి ఆర్థిక సాయం కూడా చేశారు. సూరంపల్లి గ్రామంలో ఇళ్లు నిర్మించుకొంటున్నా. నిర్మాణం శ్లాబ్‌స్టేజ్‌లో ఉంది. మరళ జగనన్న ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్న.

– చెన్న సుజాత, కండ్రిక

వ్యత్యాసం లేని సమాజాన్ని సృష్టించాలి

సామాజిక విశ్లేషకులు పి.దేవి



కృష్ణలంక(విజయవాడ తూర్పు): స్త్రీ, పురుష వ్యత్యాసం లేని సమాజాన్ని సృష్టించే బాధ్యత ఆడపిల్లలదేనని సామాజిక విశ్లేషకులు పి.దేవి అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో సోమవారం విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8, 9 ,10 తరగతుల విద్యార్థినులకు ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి అనే అంశంపై అసోసియేషన్ ప్రెసిడెంట్ వెనిగళ్ల అమ్మాజీ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవి మాట్లాడుతూ పిల్లల పెంపకంలో ఆడ మగ వ్యత్యాసం లేని చదువు ఉండేలా తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. విద్యార్థినులపై ఇంటా బయటా జరిగే లైంగిక దాడులను ఏ విధంగా ఎదుర్కోవాలి, ఎన్ని సమస్యలు ఎదురైనా లక్ష్యాలు సాధించడానికి ఏ విధంగా కృషి చేయాలి, బాల్య వివాహాలను ఏవిధంగా తిప్పికొట్టాలో వివరించారు. సేఫ్ ప్రెసిడెంట్ గుళ్లపల్లి జ్యోత్స్న మాట్లాడుతూ విద్యార్థినుల విద్య ద్వారా మాత్రమే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు దేవినేని కిషోర్ కుమార్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ దేవినేని జోనికుమారి, అసోసియేషన్ సెక్రటరీ షేక్ షరీఫున్నీసా, ట్రెజరర్ ఉషారాణి, కమిటీ సభ్యులు, పలు విద్యాసంస్థల యజమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు వాక్‌థాన్



టిక్కిల్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సోమవారం వాక్‌థాన్ నిర్వహించింది. బృందావనకాలనీలో ఎ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఎంజీ రోడ్డు వరకూ నిర్వహించిన ఈ వాక్‌థాన్‌లో 200 మంది బ్యాంక్ ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులను కేరీర్ మార్గంలో మరింత గొప్ప బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ బ్యాంక్ డెప్యూటీ జోనల్ హెడ్ ఎ. శారదమూర్తి అన్నారు. అంతేకాక ముద్ర, స్టాండ్ ఆఫ్ ఇండియా, సీజీటీఎంఎస్ఇ వంటి విభిన్న పథకాలకు రుణాలను అందించడం ద్వారా సమాజంలోని మహిళలను వివిధ వ్యాపార వెంచర్‌లను చేపట్టేలా ప్రోత్సహించడంలో తమ బ్యాంక్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బ్యాంక్ అత్యుత్తమ స్కీమ్ యూనియర్ నారీ శక్తిని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ. 2 కోట్ల వరకూ కొలేటరల్ లేని ఉచిత రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మరో డెప్యూటీ జోనల్‌హెడ్ మురళీపార్థసారథి మాట్లాడుతూ లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో, జీవితంలోని అన్ని రంగాల్లో మహిళలను చేర్చే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఈ వాక్‌థాన్‌లో రీజనల్ హెడ్ ఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితకు వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కోమల విలాస్ సెంటర్‌కు చెందిన జోడు స్వప్న భర్త కృష్ణారావు రెండేళ్ల కిందట భార్య, పిల్లలను వదిలి వెళ్లిపోయాడు. స్వప్నకు కొంతకాలంగా తణుకు శివ కుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. శివకుమార్ అవసరాల కోసం తెలిసిన వారి వద్ద స్వప్న అప్పు ఇప్పించింది. ఇటీవల శివకుమార్, స్వప్నను మరి కొంత అప్పు ఇప్పించని వేధింపులకు గురి చేయసాగాడు. స్వప్న పని చేసే షాపు వద్దకు వెళ్లి చంపుతానని బెదిరింపులకు పాల్పడసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అన్న ప్రసాద వితరణలో ఈఓ తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ విభాగాన్ని ఈఓ కెఎస్. రామారావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మహా మండపం రెండో అంతస్తుకు చేరుకున్న ఈఓ రామారావు అన్న ప్రసాద వితరణను పరిశీలించారు. భక్తులతో రామారావు మాట్లాడారు. అన్న ప్రసాద నాణ్యత, కూరలు, సిబ్బంది వడ్డించే విధానంపై ఆరా తీశారు. భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. షెడ్డు నెం:1, 2 ను తనిఖీ చేసి భక్తులు దేవస్థానానికి అందిస్తున్న విరాళాల గురించి తెలుసుకున్నారు. భక్తులు అమ్మవారికి సమర్పించే విరాళాలకు తగిన రశీదులను ఇవ్వాలని సూచించారు.

క్లుప్తంగా

చురుగ్గా రోడ్డు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మధురానగర్, ముత్యాలంపాడు, వీవీ నరసరాజు రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతు–స్పీడ్ బ్రేకర్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల ఇక్కడ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాదయాత్రలో స్థానికులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యేని కోరారు. అలాగే వాహన చోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తున్న దృష్ట్యా స్పీడ్ బ్రేకర్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఎమ్మెల్యే వెలంపల్లి రోడ్డు మరమ్మతులు చేసి స్పీడు బ్రేకర్లు వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రోడ్డు మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

స్వయం ఉపాధి కోర్సులో శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు మార్చి 7 తేదీ నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. కటింగ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజరేటర్ మెకానిజం, ఐస్‌క్రీమ్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, భాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, మిర్రర్ వర్క్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన మోడల్ కాంపిటేషన్స్‌లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులకు తమ నైపుణ్యాలను వెలికి తీసేందుకు జాతీయ సైన్స్ ఆవిష్కరణలు పునాదిగా తోడ్పడతాయన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు అద్భుత ఆవిష్కరణలు అవసరమని పేర్కొన్నారు. అనంతరం భూకంప లేకని, మట్టి కుండలతో ఏసీ, చంద్రయాన్–3, రోబోటిక్ కార్ల తయారీకి సంబంధించిన అనేక మోడల్స్‌ను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శేఖర్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

చిట్టినగర్: అక్రమంగా బీరు, మద్యంను విక్రయిస్తున్న యువకుడిని కొత్తపేట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వించిపేట రైల్వే ఆప్ యార్డు సమీపంలో ఓ యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడు. సెక్టార్ ఎస్ఐ రాజనరేంద్ర గుర్తించి యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ యువకుడు కేఎల్‌రావునగర్ వీఎంసీ కాలనీకి చెందిన కుప్పాల ఠాగూర్ కుమార్‌గా గుర్తించారు. ఠాగూర్ కుమార్ చిట్టినగర్‌లోని పలు బార్ అండ్ రెస్టారెంట్ల నుంచి మద్యం, బీర్ బాటిల్స్‌ను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి 10 బీర్ బాటిల్స్, 6 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

7న మహిళలకు ఉచిత వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న సూర్యారావుపేటలోని ఎంజే నాయుడు హాస్పిటల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎంజే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరంలో మహిళలకు ఎముకల సాంద్రత పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల అనంతరం వైద్యులు తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా తమ హాస్పటల్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.